ఎవరి భార్యల గురించి వారు సమీక్షంచవలసివస్తే వారి వారి ఆవేదనలు నివేదనలు ఎలా వుంటాయో చిత్తగించాలి!



# వాళ్ళు నలుగురు

సి. భారతి

అనుకోకుండా ఆఫీసుకు సెలవు దొరికినా చిక్కే. ఎవరో నాయకుడు హఠాత్తుగా చనిపోవటంతో సెలవు ప్రకటించాయి ఆఫీసులు.

"ఇప్పుడు యింటికి వెళ్ళి మాత్రం చేసేదేముంది? కాసేపు ఇక్కడే కూర్చుందాము" అన్నాడు వెంకటేశం.

"వెంకన్నా నాలుగు కుర్చీలు యివతల వెయ్యవోయ్" వెంటనే అందుకున్నాడు రామారావు.

"ఇంటికి వెళ్ళినా యిప్పుడు టీ కూడా యిచ్చే వాళ్ళుండరు" అంటూ కుర్చీలో కూర్చున్నాడు శశిధర్.

"మీ వాళ్ళు ఎక్కడికన్నా 'ప్రోగ్రాం' వేసుకున్నారా?" అన్నాడు రమణమూర్తి కుతూహలంగా.

ఆంధ్ర దేశంలోవున్న అనేక ఆఫీసుల్లో అదొకటి. మధ్యలో పక్కా బిల్డింగ్, చుట్టూ ఖాళీస్థలం, కాంపౌండు వాలు వున్నాయి. ఒక ప్రక్కగా రెండు పెద్ద చింత చెట్లు విస్తారంగా గాలిని పంచుతున్నాయి. ఆ చింత చెట్ల క్రిందే మన కథానాయకులు నలుగురు కుర్చీల్లో కూర్చుని శీతాకాలపు ఎండ సుఖాన్ని అనుభవిస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఇన్ని రోజుల నుండి మనం ఒకే ఆఫీసులో పని చేస్తున్నా ఒకరి విషయాలు ఒకరికి తెలియకుండానే గడిపేస్తున్నాము. ఈ రోజు మనలను మనం పరిచయం చేసుకుందాం" అన్నాడు వెంకటేశం.

"అయితే కానివ్వండి" అన్నాడు రామారావు.

భారీ ఎత్తున అట్టహాసంగా తన కుటుంబ గాథ వివరించే ప్రయత్నంలో ఉన్న శశిధర్‌ను చూసి క్లుప్తంగా "ప్లీజ్" అన్నాడు రమణమూర్తి.

"ఒక వ్యక్తి సుఖ సంతోషాలు మూడొంతులు అతని లైఫ్ పార్ట్‌నర్ మీద ఆధారపడి ఉంటాయి కాబట్టి ఈ రోజుకి సరదాగా మన భార్యల స్వభావం గురించి మాట్లాడుకుని యిక్కడి కిక్కడే మరిచిపోదాం" అన్నాడు వెంకటేశం.

"మా ఆవిడ ఇప్పుడు సినిమాహాల్లో ఉండి ఉంటుంది" అన్నాడు రామారావు.

"మీకు జోస్యం కూడా వచ్చునా" అన్నాడు వెంకటేశం.

"జోస్యం కాదండీ. నిజంగా చెపుతున్నాను. మా ఆవిడకు కొత్త సినిమా విడుదలైతే నిద్ర పట్టదు. అందుచేత అడ్వాన్సు బుకింగ్ చేయించుకుని మొట్టమొదటి 'షో' చూడవలసిందే. అందుకు హరిహరాదులు అడ్డం వచ్చినా లెక్కచేయదు."

"అడ్వాన్సు బుకింగ్ లేదు. టికెట్టు దొరకదు, అప్పుడు ఏం చేస్తారండీ" అన్నాడు శశిధర్.

"అయితే మాత్రం ఏమిపోయింది. ఆ థియేటర్ దగ్గరే కౌంటరు దగ్గర తరువాత 'షో' కోసం నిలబడి ఏదో ఒక వేళకి సినిమా చూసి ఉత్సాహభరితంగా కబుర్లు చెప్పుకుంటూ అప్పుడు యింటికి వస్తారు" అన్నాడు వెంకటేశం.

"మీకు బాగా అలవాటు అయిపోయినట్లు ఉంది" అన్నాడు రామారావు.

"అలవాటు ఏమిటి? వాళ్ళు సినిమా చూసి ఇంటికి వచ్చేటప్పుడు ఆ మనుష్యులను చూసి జడుసుకుంటారు ఎవరైనా! ప్రొద్దున్నే ఆదరాబాదరా ఏమి తింటారో ఏమో! తిరిగి వచ్చేసరికి మొఖాలన్నీ నీరసించి, వాళ్ళు నవ్వుతూ మాట్లాడినా రాక్షసులు నవ్వినట్లే ఉంటుంది, తలలు రేగిపోయి, పూలు ఎండిపోయి ఏదో వికృతానందంతో ఇంటికి చేరతారు" అన్నాడు వెంకటేశం భార్య ముఖారవిందం కళ్ళకు కట్టినట్లుగా.

"మీ సంగతి చెప్పండి" అన్నాడు శశిధర్ రామారావుని.

"ఏముందీ మా యిరుగు పొరుగు వాళ్ళు కొత్త వస్తువులు కొనకుండా ఉండాలని దేవుణ్ణి ప్రార్థిస్తుంటాను" అన్నాడు రామారావు.

"కొత్త సామాన్ల పిచ్చి అన్నమాట" అన్నాడు వెంకటేశం.



పూల సొగసులు

చిత్రం : ఈశ్వర్, కాకినాడ

"సింపుల్‌గా చెప్పాలంటే అంతే. అక్కడికీ మా అత్తగారు వచ్చినప్పుడల్లా మొత్తుకుంటూనే ఉంటుంది. "అమ్మాయి యిలా సామాన్లు మార్చి సామాన్లు తీసుకోకు. అందువల్ల మనం చాలా నష్టపోతాం. పైగా ఎప్పుడూ కొన్న వస్తువులు కొనటం డబ్బుఖర్చే కాని కొత్త వస్తువు అమరదు" అని. కాని మా ఆవిడ వింటేగా. మనింట్లో ఓరియంట్ ఫాన్ ఉందనుకోండి. ప్రక్కవాళ్ళు కొత్తగా రాలీ ఫాను కొనుక్కున్నారు. కొత్తగా మార్కెట్‌లోకి రావడంతో వాళ్ళు దానికి రంగులు, డిజైనులు ఎక్కువ పెట్టి వుంటారు. దానితో మా ఇంట్లో పదేళ్ళ నుండి వాడుతున్న పాత ఓరియంట్ స్థానే కొత్త ఫాను వెలిసింది. ఇలా ఒక్క సామాన్లే కాదు. నగలు కూడా అంతేనను కోండి" అన్నాడు రామారావు తాపీగా సిగరెట్టు వెలిగిస్తూ.

"ఇక మీరు చెప్పండి" అన్నాడు వెంకటేశం శశిధర్ నుద్దేశించి.

"నా విషయం ఏముంది? సరిగమ పద నిస. సనిదప మగరిస" అన్నాడు శశిధర్.

"అంటే మీ శ్రీమతి సంగీతం బాగా పాడతారా?" అన్నాడు రామారావు.

"నీకు సంగీతం అంటే ఎంత యిష్టమో ఎప్పుడూ చెప్పేవు కాదేమోయ్" అన్నాడు వెంకటేశం.

"అంత యిష్టమా మీకు" అన్నాడు శశిధర్.

"అవునోయ్. రోజూ కమ్మని సంగీతం వినాలంటే పెట్టి పుట్టాలి మరి" అన్నాడు వెంకటేశం.

"చూడండి వెంకటేశంగారూ. రేడియోలో కచేరి వినటానికి బాగానే ఉంటుంది. కాని దానికి ముందు ఆ గాయకులు ఎన్ని రోజులు సాధన చేయాలో ఊహించగలరా? పాడిందే పాడి. తీసిన రాగమే తీసి అన్నట్లు మా ఆవిడ ఒక్క కీర్తన రెండు నెలలనుండి సాధన చేస్తోంది. ఆవిడ తలుపులు వేసుకుని గదిలో కూర్చుని సాధన చేసుకుంటుంది కాని లేకపోతే మా ఇంట్లో వాళ్ళ చెవులు ఈ పాటికి ఏ స్థితిలో వుండేవో" అన్నాడు శశిధర్.

"రమణమూర్తిగారూ ఇక మీరు మిగిలారు" అన్నాడు రామారావు.

"నేనా. నేనేం చెప్పనండి. మా ఆవిడకు ఇలాంటి సరదాలు ఏమీ లేవే మరి" అన్నాడు రమణమూర్తి.

"మీరు మీ భార్యను తలుచుకోగానే ఎలా గుర్తుకు వస్తారో చెప్పండి" అన్నాడు శశిధర్.

"మా ఆవిడ నా కంటికి ఎప్పుడూ చీపురుకట్ట పట్టుకునో, ఇల్లు తుడిచే గుడ్డ పట్టుకునో కనపడుతూ ఉంటుంది. నేను ఇంట్లో నుండి బయటకు వచ్చాననుకోండి నేను నడిచినంత దూరం తడిబట్ట పెట్టి తుడుస్తుంది. స్టౌ శుభ్రంగానే ఉందనుకోండి. కాఫీ పెట్టుకుని తాగాము. మళ్ళీ ఒకసారి స్టౌ శుభ్రంగా తుడిచేసి క్రింద కాఫీ చుక్కలు పడకపోయినా తడిగుడ్డతో ఒకసారి తుడిచేసి, కాఫీ తాగిన గ్లాసులు పొడి బట్టతో తుడిచి అలమరలో పెడుతుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే ఆవిడ సమగ్ర స్వరూపం ఏమిటంటే చేతిలో చీపురు కాని, ఇల్లు తుడిచే బట్టకాని, నీళ్ళ బకెట్టు కాని లేకుండా ఆవిడ కనపడదు. ఇవి లేకుండా ఆవిడ కనపడిందంటే ఆవిడ మా ఇందిరే కాదు" అన్నాడు రమణమూర్తి.

"బాబుగారూ టీ తెచ్చాను" అన్న వెంకన్న పిలుపుతో నలుగురూ టీ త్రాగటానికి ఉపక్రమించారు. ★